క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రామయ్యతండ్రి సంబరాలు



పందిరికి వేలాడదీసిన అరటిగెలలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కంపోస్టు కాలనీలో రామయ్య తండ్రి, సింహాద్రి అప్పన్న సంబరాలు ఆదివారంతో ముగిశాయి. దూబ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సంబరాలు జరిగాయి. ఉత్సవ మూర్తులను ఊరేగించి నాగావళి నదీ తీరానికి తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది.

త్రిపురసుందరదేవికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని తమ్మినాయుడుపేటలో త్రిపురసుందరిదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని సత్యసాయి సేవా సమితి (పెద్ద మందిరం) ఆధ్వర్యంలో ఆదివారం రక్తహీనతపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఎస్.చిట్టిబాబు, డాక్టర్ ఎల్.సోమశేఖర్‌లు 200 మంది రక్తహీనత బాధితులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, అన్నపూర్ణ సేవా ట్రస్టు అధ్యక్షుడు గంగుల రమణబాబు, సేవాదళ్ కో–ఆర్డినేటర్ ఎస్.రామచంద్రరావు, జోనల్ కన్వీనర్ పి.నాగేశ్వరరావు, మందిర కన్వీనర్ కె.మురళీకృష్ణ, సభ్యులు మెట్ట నాగభూషణం, శివన్నారాయణ పాల్గొన్నారు.

పోటీతత్వం అలవరుచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

లావేరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని మురపాక శాఖా గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కథల పుస్తకాలు చదవడంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి



చదువుతున్న విద్యార్థి

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు చదవడం, రాయడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని బలగ గ్రంథాలయశాఖాధికారి పి.ఉగ్రసేన అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. 17 మంది విద్యార్థులు పద్యాలు, తాత్పర్యాలు చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్ కె.అనిత పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌కు సొంత గోదాం



బొడ్డపాడు వద్ద నిర్మించిన నూతన గోదాం

లావేరు: మండలంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు సొంత గోదాం నిర్మించారు. లావేరు మండలంలోని రేషన్ డిపోలకు, ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, హాస్టల్స్‌కు ప్రభుత్వం ఇస్తున్న సరుకులు అందజేయడం కోసం లావేరులో ఏపీ పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గోదాం ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి సొంత గోదాం లేకపోవడంతో 25 ఏళ్లుగా అద్దె గోదాంలో ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వహిస్తున్నారు. గత పాలకులు సొంత గోదాం నిర్మాణంపై దృష్టి సారించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో తాళ్లవలస రెవెన్యూ పరిధిలో బొడ్డపాడు వద్ద ప్రభుత్వ స్థలంలో 1000 టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మించారు. పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే గోదాం ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

నిధులున్నా పనుల్లో జాప్యమెందుకు?

- జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేసేదెప్పుడు?
- అధికారులపై మండల సభ్యుల ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

జి.సిగడాం : జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. పలు అంశాలకు సంబంధించి అధికారుల తీరుపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్ పథకం పనులు గ్రామాల్లో నత్తనడకగా సాగుతున్నాయని, సంబంధిత కాంట్రాక్టర్ సకాలంలో పనులు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు గేదెల వరలక్ష్మి, కుదిరేళ్ల సుజాత పెద్ది శ్రీనివాసరావు, బూటు దమయంతి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి స్పందిస్తూ పనులకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. గ్రామాల్లో నెలకొన్న చిన్న, చిన్న సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారుల్లో చలనం ఉండటం రాలేదని, సర్పంచులకు సమాచారం ఇవ్వడంలేదని సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, భూపతి సురేష్‌కుమార్, బగాది అప్పలనాయుడు, అల్లు జోగినాయుడు, తిరుమరెడ్డి వెంకటరావు, గోక మహేశ్వరావు మండిపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పంపిణీలో సర్పంచులకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ సత్యవతి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు స్పందిస్తూ ఇకపై ప్రతి సభ్యునికీ సమాచారం అందిస్తామని హామీ ఇచ్చారు. పెంట, నాగులవలస గ్రామాల్లో నియమించిన పశు వైద్యాధికారి ఇంతవరకు జాడ లేదని, పదుల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడుతున్నా పట్టించుకునే వారే లేరని సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత సభ దృష్టి తీసుకువచ్చారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఆర్‌బీకేల ద్వారా పూర్తిస్థాయిలో విత్తనాలు సరఫరా చేయాలన్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి వై.శారద మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, డిప్యూటీ తహసీల్దార్ నిర్మల, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, విద్యుత్‌శాఖ ఏఈఈ కె.తిరుపతిరావు, మండల విద్యాశాఖాధికారి అరసాడ రవి, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇన్‌స్పైర్ స్కూల్ ఆవరణలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం, ఇన్‌స్పైర్ స్కూల్ ఆధ్వర్యంలో జెమ్స్ హాస్పిటల్ వైద్యులతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అన్నెపు శశిధర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారందరూ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు అన్నెపు సత్యనారాయణ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 300 మందికి ఉచిత ఈసీజీ, 2డీ ఎకో బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పైర్ స్కూల్ కరస్పాండెంట్ అన్నెపు అనంతరావు, జెమ్స్ వైద్య బృందం, రోటరీ సహాయ గవర్నర్ ఎంఆర్‌కే దాస్, కార్యదర్శి బరాటం శ్రీనివాస, ఉపాధ్యక్షులు గీతా శ్రీకాంత్, ఇప్పిలి వెంకన్న చెట్టి, గౌరి, శంకర్, డాక్టర్ వారణాసి సందీప్, చాగంటి జగదీష్ కుమార్, శ్రీనివాస్ చక్రవర్తి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం పాల్గొన్నారు.

వేమన రచనల్లో సామాజిక స్పృహ



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: వేమన రచనలు సామాజిక దృక్పథం కలిగి ఉంటాయని తెలుగు పండితులు పూడి మోహనరావు అన్నారు. బాపూజీ కళామందిర్‌లో వేమన–సామాజిక దృక్పథం అనే అంశంపై ఆదివారం ప్రసంగించారు. వేమన తన అనుభవాల నుంచి వచ్చిన జ్ఞానాన్ని పద్యాల ద్వారా మనకు అందించారని చెప్పారు. సమాజంలోని రీతులను, నీతులను తెలియచేయడానికి సామాన్యుడికి అర్థమయ్యే భాషలో నిత్య సమస్యలను ధిక్కరణ స్వరంతో ఆటవెలది పద్య చందస్సులో సమాజ వికాసానికి కృషి చేసిన అచ్చతెలుగు కవి వేమన అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సనపల నారాయణమూర్తి, ఎం.శ్రీనివాసరావు, నిష్టల నర్సింహమూర్తి, కోమలరావు, పతంజలి శాస్త్రి, శివరాం, తవుడు, డి.జి.పట్నాయక్, పి.ప్రసాద్, సరస్వతి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సీఎంఈ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: చాలా గ్రామాల్లో మహిళలు రక్తహీనత, ఎనిమియా వ్యాధులతో బాధపడుతున్నారని, అటువంటి వారిపై శ్రద్ధ వహించి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, గైనకాలజిస్ట్ దానేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో నిర్వహించిన 'సీఎంఈ ఆన్ కామన్ క్లినికల్ సినారియోస్ ఓబీజీ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉత్తరాంధ్రలో గైనకాలజిస్ట్‌లంతా ఒకే తాటిపైకి వచ్చి కమిటీ ఏర్పాటు చేసుకున్నామన్నారు. జూనియర్ డాక్టర్లు, వర్ధమాన డాక్టర్లు కలిసి పలు అంశాలుపై చర్చించినట్లు తెలిపారు. మహిళల ఆరోగ్య సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపేలా సొసైటీ పనిచేస్తుందన్నారు. కాగా, సీఎంఈ అధ్యక్షునిగా దానేటి శ్రీధర్, సెక్రటరీగా డాక్టర్ ఎస్.శ్రీదేవి, ట్రెజరర్‌గా డాక్టర్ సందీప్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ డి.పార్వతి, పి.శివాజీ, జాయింట్ సెక్రటరీగా ఎ.సంధ్య, డాక్టర్ భారతీ, డాక్టర్ మంజుల, ప్రోగ్రాం డిజైనర్‌గా డాక్టర్ ఆర్.అరవింద్, పలువురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నికయ్యారు.

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఔదార్యం



మోహనరావుకు సాయం అందజేస్తున్న సర్పంచ్ ప్రకాష్ తదితరులు

కవిటి: బిగొనపపుట్టుగ గ్రామానికి చెందిన మల్లార్పు మోహనరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అబ్దుల్‌కలాం ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్ నేతృత్వంలో ఆదివారం మోహనరావు ఇంటికి వెళ్లి పది వేల రూపాయల సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాష్ మాట్లాడుతూ.. కలాం ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్తు సోమేశ్వరావు, బిజోత్స్న, జి.జానకీరావు, బి.భాస్కరరావు, నర్తు సోంబాబు, గ్రామపెద్దలు పూడి రామారావు, బి.లోకనాథం పాల్గొన్నారు.

నూనెగింజల సాగుపై ఆసక్తి



కుశాలపురంలో పొద్దుతిరుగుడు సాగు



బైపాస్ సమీపంలో జనుము సాగు

ఎచ్చెర్ల క్యాంపస్: నూనె గింజల సాగుతో తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం సాధ్యమవుతోంది. ఖరీఫ్ వరి కోత తరువాత పొలాల్లో ముమ్మరంగా నూనె గింజలు సాగు చేస్తున్నారు. కుశాలపురం, తోటపాలేం, ముద్దాడ, కొంగరాం వంటి గ్రామాల్లో పొద్దుతిరుగుడు, నువ్వు, వేరుశనగ, జనుము సాగు చేస్తున్నారు. అపరాల సాగుకంటే నూనె గింజల పంటలు లాభదాయకంగా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. పంటల యాజమాన్యం ఖర్చులు తక్కువగా ఉండటం, మెరుగైన దిగుబడి, నీటి తక్కువ వినియోగంతో ఆరుతడి పంటలుగా సాగు చేయటం, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటం వంటి కారణాలతో జనుము, నూనె గింజల సాగుకు రైతులు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. వ్యవసాయాధికారి వై.సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం నూనె గింజల సాగుకు మంచి డిమాండ్ ఉందని చెప్పారు. రైతులు ఆరు తడి పంటలుగానూ సాగు చేయవచ్చని చెప్పారు. సరైన విత్తనాలు ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

కుటుంబానికి ఆర్థిక సాయం



సురేష్ కుటుంబానికి సాయం చేస్తున్న అభిమానులు

రణస్థలం: విశాఖపట్నంలో అల్లు అర్జున్ ఆర్మీ వైజాగ్ టీమ్‌కు చెందిన అభిమాని సురేష్ ఇటీవల తన ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆ కుటుంబానికి రణస్థలం అల్లు అర్జున్ ఆర్మీ టీం వెళ్లి ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో అభిమానులు మైలపల్లి బన్నీ, సూరాడ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి డే అండ్ నైట్ క్రికెట్ టోర్నీ



మాట్లాడుతున్న ఆర్ఎస్‌పి క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో శివరాత్రికి ఈ నెల 17, 18 తేదీల్లో డే అండ్ నైట్ క్రికెట్ జిల్లా టోర్నమెంట్ (డీపీఎల్ సీజన్ ఫోర్) నిర్వహిస్తున్నామని ఆర్ఎస్‌పి క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు పెదిరెడ్ల రాము, డేవిడ్, అనిల్ ఆదివారం తెలిపారు. 17 ఉదయం నుంచి రాత్రి 12 వరకు, 18న ఉదయం నుంచి పోటీలు ముగిసే వరకూ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. 8 ఓవర్ల చొప్పున మ్యాచ్ ఉంటుందని, మొదటి 30 జట్లును మాత్రమే పోటీలకు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ క్రీడాకారుడు యూనిఫాం వేసుకోవాలని, అడ్రస్ కోసం ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుందన్నారు. విన్నర్స్, రన్నర్స్‌కు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మేన్‌లకు ప్రత్యేక నగదు బహుమతి అందిస్తామన్నారు. ఆసక్తి గల జట్లు ఫోన్ 80083 74884, 95732 07752, 77028 53628 నంబర్లను సంప్రదించాలన్నారు.

యువతలో భక్తిభావం పెంపొందాలి



ప్రవచనాలు చెబుతున్న ప్రకాశ్‌స్వామి

పోలాకి: యువతలో భక్తిభావం పెంపొందాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారకులు లంకవలస ప్రకాశ్‌స్వామి అన్నారు. ఆదివారం చింతాడపేట లోని రామయోగి సేవాశ్రమంలో నిర్వహించిన సత్సంగంలో ఆయన పాల్గొన్నారు. భక్తిభావం వల్ల చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని, పెద్దలంటే గౌరవం ఏర్పడుతుందన్నారు. పూర్వకాలంలో భక్తిమార్గం అనుసరించిన వాళ్లంతా జీవితంలో గొప్పస్థాయికి వెళ్లారని గుర్తుచేశారు.

ఉత్సాహంగా 5కే రన్

కవిటి: ఉద్దానం ప్రజలు, అభాగ్యుల సేవే పరమావధిగా నడుస్తున్న స్పెషల్ గయ్స్‌ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం కవిటిలో 5 కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దసంఖ్యలో యువకులు తమ శారీరక ధారుడ్యాన్ని పరీక్షించే క్రమంలో పరుగులో పాల్గొన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతుల్ని సంస్థ బాధ్యులు అందించారు. సంస్థ ఆవిర్భావం నుంచి చేపడుతున్న సేవా కార్యక్రమాలే ఇతివృత్తంగా నిర్మించిన ఎస్‌జీఎఫ్ సినిమా విడుదల సందర్భంగా కవిటి మహలక్ష్మి థియేటర్‌లో ప్రేక్షకులకు ఉచితంగా ప్రదర్శించారు. మూడు షోలలో పెద్దసంఖ్యలో ప్రజలు ఈ సినిమా చూసి సంస్థ సభ్యుల్ని ప్రశంసించారు.

● అభినయం అదరహో..!



అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో ఆదివారం సాయంత్రం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన వందనా డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఈ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాశరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.

– అరసవల్లి

లావేరు హైస్కూల్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం రాజారావు, పీఎంసీ చైర్మన్ మల్లేశ్వరరావు

లావేరు: లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గుడివాడ శ్రీనివాసరావు, సోదరులు.. తమ తల్లిదండ్రులు గుడివాడ అప్పారావు, సూరమ్మల జ్ఞాపకార్థం పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల స్టేజీ పైకప్పును సైతం సొంత నిధులతో ఏర్పాటు చేశారు. లావేరు హైస్కూల్ హెచ్ఎం పట్నాన రాజారావు, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు తదితరులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, స్టేజీ పైకప్పును ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.కృష్ణ, పూర్వ విద్యార్థి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు మంగరాజు, గోవిందరావు, మహేష్, కాళి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస పునరావాస కాలనీ)లో ఉన్న సంతోషి మాత ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదే గ్రామానికి చెందిన ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, స్థానిక సర్పంచ్ రెడ్డి రామారావు దంపతులు విఘ్నేశ్వర పూజతో వేడుకలను ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యే పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు గ్రామ పురోహితులు భాస్కరభట్ల వరప్రసాద్ శర్మ తెలిపారు. సోమవారం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు ఉంటాయని సర్పంచ్ రెడ్డి రామారావు చెప్పారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో ఈకేవైసీ పర్యవేక్షిస్తున్న ఏఓ సురేష్



జి.సిగడాం: ఎందువలో ఈ-కేవైసీ చేయిస్తున్న ఏఓ శారద

ఎచ్చెర్ల క్యాంపస్: రబీ పంట నమోదులో భాగంగా రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎచ్చెర్ల మండల వ్యవసాయాధికారి వై.సురేష్ అన్నారు. పొన్నాడలో ఈకేవైసీ తీరు, పూర్తయిన శాతాన్ని ఆదివారం పరిశీలించారు. ఎచ్చెర్ల మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రబీ పంట నమోదు ఈకేవైసీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 15లోగా ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఈకేవైసీ ఆధారంగా పంట కొనుగోళ్ల భవిష్యత్తు ప్రణాళిక ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు ఆర్‌బీకే సహాయకులను సంప్రదించాలని సూచించారు.

జి.సిగడాం: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి యర్రా శారద కోరారు. ఆదివారం ఎందువ గ్రామంలో రైతుల ఇంటి వద్దకు వెళ్లి ఈ-కేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించే ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ బోనెల యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు అడవి పందుల బెడద



కేశవరాయునిపురంలో అడవి పందుల ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

లావేరు: మండలంలోని కేశవరాయునిపురం, జీజీవలస, లావేటిపాలేం, ఇజ్జుపేట, కొత్తకుంకాం, కొండకుంకాం, లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల్లో శనివారం రాత్రి మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో తీవ్ర నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అడవి పందులు గుంపులుగా వచ్చి మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. రాత్రివేళ కాపలా ఉన్న సమయంలో పందులు రావడంలేదని, ఏమాత్రం మేల్కొని లేకపోయినా పంటను ధ్వంసం చేస్తున్నాయని చెబుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి మొక్కజొన్న పంటను సాగు చేశామని, అడవి పందుల వల్ల దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఫారెస్టు అధికారులు స్పందించి అడివి పందులు పంటలను ధ్వంసం చేయకుండా తగు చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు.

36 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామం వద్ద పోలీసులు తనిఖీల్లో 36 ఒడిశా మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బూరగాం గ్రామానికి చెందిన కొరాడ కృష్ణ వద్ద ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీకాకుళం నగరంలోని గూనపాలెంలో శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో ఆదివారం 1995-97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆనాటి ఆత్మీయ స్మృతులను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారంతా తమని తాము పరిచయం చేసుకుని జ్ఞాపకాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సురంగి మోహనరావు, ప్రెసిడెంట్ సురంగి నిర్మలాదేవి, డైరెక్టర్లు కొర్ను నాగార్జున ప్రతాప్, కొర్ను పావని, పల్ల కృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ